

కురవి, సీరోలు ఎంఈవోలు బాలాజీ, లచ్చిరాంలకు సమ్మె నోటీస్ ఇస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఎస్ఎస్ఏల రణం

క్రమబద్ధీకరణ కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు నేటి నుంచి 9 వరకు నిరసనలు

- ప్రభుత్వం హామీ ఇవ్వకుంటే 10 నుంచి నిరవధిక సమ్మె
- రేవంత్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలని డిమాండ్
- టీపీటీఎఫ్, టీటీయూ, టీయూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల మద్దతు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యాశాఖ సమగ్ర శిక్ష (ఎస్ఎస్ఏ)లో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు నేటి నుంచి నిరసన బాట పట్టనున్నారు. కొలువుల క్రమబద్ధీకరణతో పాటు కనీస వేతన స్కేల్‌ను అమలు చేయాలనే డిమాండ్‌తో శుక్రవారం నుంచి ఈ నెల 9వ తేదీ వరకు ఆయా జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు నిర్వహించనున్నారు. అప్పటికీ రాష్ట్రప్రభుత్వం నుంచి స్పందనరాకపోతే ఈనెల 10వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేసేందుకు ఉద్యోగులు ఇప్పటికే సన్నద్ధమయ్యారు.

ఈ మేరకు రాష్ట్ర సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం (జాక్) పిలుపు మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు, పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అలాగే హైదరాబాద్‌లో ఎస్పీడీ కార్యాలయంలో సమ్మె నోటీస్‌నూ అందచేశారు. సమగ్రశిక్షలో విధులు నిర్వహిస్తున్న సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కేజీబీవీ సీఆర్టీలు, ఐఈఆర్పీలు, పీటీఐ, అకౌంటెంట్లు, మెసెంజర్లు, బోధనేతర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 2 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఈ ఆందోళనలతో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో మండల విద్యావనరు కేంద్రం (ఎమ్మార్సీ)లు తెరుచుకునే పరిస్థితిలేదు. అలాగే ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోనున్నాయి.

నాడు టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి..

గత ఏడాది సెప్టెంబరులో హన్మకొండలో ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో నిరవధిక సమ్మె చేస్తున్న శిబిరాన్ని టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి సందర్శించారు. ఆ నాడు రేవంత్‌రెడ్డి రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, తాము అధికారంలోకి రాగానే మీ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని పేర్కొంటున్నారు. ఇచ్చిన హామీకి సంవత్సరం అయింది, వెంటనే క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో సమ్మె చేసేందుకు సిద్ధమయ్యారు. తాజాగా రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను కూడా చేశామని, ప్రభుతం ప్రవేశపెడుతున్న ప్రతీ పథకాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువయ్యేలా చేస్తున్నామని పేర్కొంటున్నారు.

అరకొర వేతనాలతో..

అరకొర వేతనాలతో బతుకు బండిని ఈడ్చుకొస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు స్వరాష్ట్రం సిద్ధిస్తే బతుకులు బాగుపడతాయని అనుకున్న ఉద్యోగులకు నిరాశే మిగిలింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి అన్నిశాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామన్న నాటి ఉద్యమ నాయకుడు, మాజీసీఎం కేసీఆర్ మాటలు సమగ్ర శిక్ష ఉద్యోగుల విషయంలో నీటిమూటలుగానే మిగిలిపోయాయని వాపోతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎస్ఏలో నియమించబడిన ఉద్యోగులకు ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఎస్ఎస్ఏ అన్ని విభాగాల ఉద్యోగులకు నెలకు రూ.30,500 వేతనం ఇస్తుండగా, స్వరాష్ట్రం తెలంగాణలో మాత్రం రూ.20 వేలలోపే ఇస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండువేల మంది..

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సర్వశిక్షా అభియాన్ వివిధ విభాగాల్లో సుమారు 2 వేల మంది విధులు నిర్వహిస్తున్నారు. 2006 నుంచి 2012 వరకు విద్యాశాఖలో అవసరాలను బట్టి కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాల నియామకాలు చేపట్టారు. డివిజన్ స్థాయిలో డివిజన్ లెవల్ మానిటరింగ్ టీం మెంబర్ (డీఎంఎల్‌టీ), మండలస్థాయిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (సీఆర్పీ), ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ (ఐఈఆర్పీ), మెసెంజర్లు మండల విద్యావనరుల (ఎమ్మార్సీ) కేంద్రాలకు, ప్రభుత్వ ఉపాధ్యాయులకు వారధిగా ఉంటూ ప్రభుత్వ పాఠశాలలు, విద్యారంగాభివృద్ధికి కృషి చేస్తున్నారు. వీరితో పాటు కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో విధులు నిర్వహిసున్న సీఆర్టీలు, పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న పీటీఐలు తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా అరకొరవేతనాలతో బతుకు బండిని నెట్టుకొస్తున్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల విధులివే..

ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం రాష్ట్రప్రభుత్వం, విద్యాశాఖ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు పరుస్తుండటంలో ప్రముఖ పాత్ర పోసిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత యూనిఫామ్, నోట్ పుస్తకాలు పంపిణీ, మధ్యాహ్నబోజనం బియ్యం పాఠశాలలకు చేర్చుట, నిర్వహణ అమలు, రోజు వారీగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, ఆన్‌లైన్‌లో విద్యార్థుల నమోదు, 14 ఏళ్లలోపు బడీడు పిల్లను గుర్తించి బడిలో చేర్పించుట, ఉపాధ్యాయులు సెలవులో ఉంటే పాఠశాలల నిర్వహణ మొదలగు విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు ఎప్పుడు ఏ సమాచారం అడిగినా వెంటనే అధికారులకు చేరవేస్తున్నారు. కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంలేదు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పును అమలు చేసి క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగుల డిమాండ్లు ఇవే..

- సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి క్రమబద్ధికరించాలి
- ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్ని వసతులు కల్పించాలి.
- మరణించిన ఉద్యోగులకు రూ. 20 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలి

టైం స్కేల్ అమలు చేస్తూ క్రమబద్ధీకరించాలి

మారగాని జానకిరాములు, ఎస్ఎస్ఏ జాక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మానుకోట



పద్దెనిమిది సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులకు టైం స్కేల్ అమలు చేస్తూ క్రమబద్ధీకరించాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పాఠశాల స్థాయికి తీసుకెళ్తూ బడుల బలోపేతానికి కృషి చేస్తున్నాం. మండల విద్యాశాఖాధికారులు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, ప్రధానోపాధ్యాయులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అడిగిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేస్తున్నాం.

మహిళా ఉద్యోగులకు వర్తించే బెనిఫిట్స్ కల్పించాలి

అరుణ, సీఆర్పీ, మానుకోట



ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్న తమకు ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు కల్పిస్తున్న బెనిఫిట్స్ కల్పించాలి. కాంట్రాక్టు పద్ధతిలో తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటున్న తమకు ప్రభుత్వం అండగా ఉండాలి. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేసి, ఆదుకోవాలి.

విభజన హామీని విస్మరిస్తున్న కేంద్రం

- తెలంగాణలో ఐఐఎంను ఏర్పాటు చేయాలి
- పార్లమెంట్‌లో ఎంపీ పోరిక బలరాంనాయక్ డిమాండ్



పార్లమెంట్ సమావేశాల్లో మాట్లాడుతున్న పోరిక బలరాంనాయక్

మహబూబాబాద్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రభుత్వం విభజన హామీలను విస్మరిస్తోందని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాంనాయక్ ఆరోపించారు. న్యూఢిల్లీలో జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో గురువారం ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలో పొందుపర్చిన విధంగా తెలంగాణ రాష్ట్రంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ ఏర్పాటు సమయంలో నాటి యూపీఏ ప్రభుత్వం రాష్ట్రంలో ఐఐఎంను ఏర్పాటు చేయాలని విభజన చట్టంలో పొందుపర్చినట్లు తెలిపారు. గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం హామీలను విస్మరించడంతో విద్యారంగానికి తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన చట్టంలో భాగంగా తెలంగాణలో ప్రతిష్టాత్మక ఐఐఎం ఏర్పాటు కోసం కేంద్రం ఇప్పటి వరకు ఏమి చర్యలు తీసుకుందని సంబంధిత మంత్రిని ప్రశ్నించారు. త్వరలోనే ఐఐఎం ఏర్పాటుకు శ్రీకారం చుట్టాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ యాప్ ఆవిష్కరణ



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పొ, కె.వీరబ్రహ్మచారి, జిల్లా అధికారులు

మహబూబాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ రూపొందించిన ఇందిరమ్మ ఇళ్లసర్వే మొబైల్ యాప్‌ను గురువారం హైదరాబాద్ రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి లాంచనంగా ఆవిష్కరించారు. దీనిని రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. మహబూబాబాద్ జిల్లా నుంచి అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మచారి, హౌసింగ్ అధికారులు వీక్షించారు. రూ.22, 500 కోట్లు వెచ్చిస్తూ తొలివిడతలో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 ఇళ్ల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ ఇందిరమ్మ ఇళ్ల యాప్ ద్వారా సర్వే నిర్వహిస్తారని తెలిపారు. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సమర్థవంతంగా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం హౌసింగ్ రాష్ట్ర నోడల్ అధికారి వీపీ గౌతమ్ అన్ని జిల్లాల సంబంధిత అధికారులతో వీసీ నిర్వహించి, తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ వీసీలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పొ, కె.వీరబ్రహ్మచారి, అధికారులు హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశాలతోనే సరి.. సమస్యలకు పరిష్కారమేది?

- నేడు తొర్రూరు మునిసిపల్ పాలకవర్గ భేటీ
- హాజరుకానున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

6

పొగుళ్లపల్లిలో అకాల వర్షం

- టార్పాలిన్లు లేక అవస్థలు
- కనీస చర్యలు తీసుకోని నిర్వాహకులు



పొగుళ్లపల్లిలోని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

కొత్తగూడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గురువారం వర్షం కురిసింది. పీఏసీఎస్ ఆధ్వర్యంలో పొగుళ్లపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి రైతులు ధాన్యం తీసుకురాగా, వానకు తడిసింది. కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు, టార్పాలిన్‌లు ఏర్పాటు చేయకపోవడంతో వర్షానికి వడ్లు తడవడంతో కర్షకులు విలపిస్తున్నారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు టార్పలిన్ కవర్లు ఇవ్వకకపోవడంతో.. కర్షకుల వద్దఉన్న కవర్లు కప్పినా ధాన్యం తడిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో తరలించకపోవడంతో తడిసిపోయి నష్టపోవాల్సి వచ్చిందని రైతులు ఆరోపించారు.

రేపటి ఆటోల బంద్‌ను జయప్రదం చేయాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 7న తెలంగాణ ప్రగతిశీల ఆటోమోటార్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుపతలపెట్టిన ఆటోల బంద్‌ను జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి హెచ్.లింగన్న గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉచితబస్సు పథకంతో ఆటో డ్రైవర్‌లు నష్టపోతున్నారని, పెండింగ్‌లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో, క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని ప్రకటించి, సంవత్సరం కావొస్తున్నపటికి ఆ హామీఅమలు కాలేదన్నారు. కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన 2019 మోటార్ వాహనాల చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఆటో డ్రైవర్, క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



నర్సయ్య(ఫైల్)

నెల్లికుదురు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓవ్యక్తి మృతి చెందిన ఘటన నర్సింహులగూడెంలో గురువారం రాత్రి జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం. పెదగోని నర్సయ్య (45) ఇంట్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడటంతో కరెంట్ తీగలను సరి చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఉపేంద్ర, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఎస్సెస్సీలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి



పర్వతగిరిలో ఎస్సెస్సీ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) :వచ్చే పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి సూచించారు. మహబూబాబాద్ మండలం పర్వతగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్సెస్సీ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చిలో జరగనున్న టెన్త్ పరీక్షలకు హాజరయ్యే ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా చూడాలన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించే విధంగా సంసిద్ధులను చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. రోజూ పరీక్షలు నిర్వహించి వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో డీఎస్వో అప్పారావు, హెచ్ఎం శ్రీరాములు, ఉపాధ్యాయులు రవి, రవికుమార్, పెరుమయ్య, శ్రీనివాసులు, ప్రభాకర్, నాగవర్ధన్ పాల్గొన్నారు.


సృజనాత్మకతను వెలికితీసేందుకు దోహదం..

అటల్ టింకరింగ్ వర్క్‌షాప్స్ నిర్వహించటం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయవచ్చని రవీందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని మోడల్ స్కూల్‌లో ఈనెల 5 నుంచి 7 వరకుయూనిసెఫ్ మరియు విజ్ఞాన్ ఆశ్రమ్‌ల ఆధ్వర్యంలో వరంగల్, హన్మకొండ, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల ఉపాధ్యాయులకు అటల్ టింకరింగ్‌పై వర్క్‌షాపు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు, సాంకేతికంగా అభివృద్ధి చేందుటకు దోహదపడుతుందన్నారు. డీఎస్వో అప్పారావు, ప్రిన్సిపాల్ ఉపేందర్, యానిసెఫ్ కో-ఆర్డినేటర్స్ గణేష్, హేమ పాల్గొన్నారు.

అమీర్యతండా పాఠశాలకు తాళం

- ఉపాధ్యాయుడికి మెమో జారీ
- ఒకరోజు వేతనం కట్





అమీర్యతండా పాఠశాల (ఇన్‌సెట్‌లో) తాళం వేసి ఉన్న దృశ్యం

నర్సింహులపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సమయం దాటినా ఉపాధ్యాయుడు విధులకు హాజరు కాకపోవడంతో మెమో జారీచేసి, ఒకరోజు వేతనం కట్ చేసిన ఘటన అమీర్యతండాలో గురువారం జరిగింది. మండల ప్రజాపరిషత్ పాఠశాలలో ఐదు తరగతులకు గాను 11 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యాబోధనకు ఇద్దరు ఉపాధ్యాయు లను కేటాయించారు. వారిలో ఒక ఉపాధ్యాయురాలు చిల్డ్రన్ కేర్‌లీవ్‌లో ఉన్నారు. మరొక ఉపాధ్యాయుడు విధులకు సకాలంలో హాజరుకాలేదు. ఈ విషయం జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి చేరడంతో సదరు ఉపాధ్యాయుడిపై మెమో జారీచేసి, ఒకరోజు వేతనం కట్ చేసినట్లు ఎంఈవో రామ్మోహన్‌రావు తెలిపారు. కాగా, అమీర్యతండా పాఠశాలలో అసలు విదార్థులులేరని, 11 మంది ఉన్నట్లు డైస్ రికార్డులో చూపి ఇద్దరు ఉపాధ్యాయులు కాలం గడుపుతున్నట్లు తండావాసులు ఆరోపిస్తున్నారు.



దామరవంచ గిరిజన బాలుర గురుకుల పాఠశాలను సందర్శిస్తున్న డీఎంహెచ్‌వో మురళీధర్

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

జిల్లా వైద్యాధికారి మురళీధర్

గూడూరు, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) గుండాల మురళీధర్ సూచించారు. దామెరవంచ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో అయోధ్యపురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి యమున ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం ఏర్పాటు చేసి 430మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు.అందులో 74మంది విద్యార్థులకు దగ్గు, జలుబు, అలర్జీ ఉండడంతో వారికి మందులను అందజేశారు. ఈ శిబిరాన్ని మురళీధర్ సందర్శించారు. గురుకులంలోని డార్మెటరీ గదులు, పరిసరాలను పరిశీలించారు. డాక్టర్లు యమున, విజయ్‌కుమార్, రామకృష్ణ, వడ్డెబోయిన శ్రీనివాస్, డాక్టర్ శ్రీమన్నారాయణ, లోక్యనాయక్, గణేష్, సర్దార్‌బాబు, ఇమాకర్, సరోజన, భవాని పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై దాడులను అరికట్టాలి

టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేష్

కురవి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులపై దాడులను అరికట్టాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేష్ అన్నారు. మొద్దులగూడెం జడ్పీహెచ్ఎస్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అలాగే రాయచోటి ఉన్నత పాఠశాలలో పనిచేసిన ఎజాజ్ ఆహ్మద్‌పై దాడిని నిరసిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులపై విద్యార్థులు దాడి చేయడం సహేతుకం కాదన్నారు. ఓదెల శివ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హెచ్ఎంతోట శ్రీరాములు, ప్రైమరీ హెచ్ఎం మల్లయ్య, ఉపాధ్యాయులు కేఎస్.లత, ఇందిరా, భాగ్యలక్ష్మి, రజిత, రమేష్, సునిల్, వెంకన్న, శ్రీనివాస్, శైలజా, సరిత, కావ్య పాల్గొన్నారు.

పొట్టకూటి కోసం వెట్టిచాకిరీ!

- సమస్యలతో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డులు
- పెరగని వేతనాలు, అమలు కాని పీఆర్‌సీ
- పోలీసులతో సమానంగా విధుల నిర్వహణ
- సంక్షేమ విషయంలో మాత్రం చిన్నచూపు
- అమలుకాని ఎక్స్ సర్వీస్‌మెన్ రిజర్వేషన్
- ఆవిర్భావ వేడుకలూ నిర్వహించలేని దైన్యం



నేడు హోంగార్డుల దినోత్సవం

ఖాకీ వనంలో వాళ్లు ఓ వెట్టిచాకిరీ జీవులు. శాంతి భద్రతల విధుల్లో, ట్రాఫిక్ కట్టడిలో, ఉన్నతాధికారుల సహాయక విధుల్లో అలుపెరుగని సేవలు చేస్తుంటారు. కానీ వేతనం, ఇతర సదుపాయాల్లో మాత్రం హోంగార్డులు వివక్షను ఎదుర్కొంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పెరిగిన వేతనం తప్ప.. ఇప్పటివరకు పెంపు మాటే లేదు. గతంలో ఏర్పాటు చేసిన పీఆర్‌సీ ఊసేలేదు. రిక్రూట్‌మెంట్‌లో ఎక్స్‌సర్వీస్‌మెన్ కోటా అమలుకావడం లేదు. అయితే హోంగార్డుల సమస్యల పరిష్కారానికి ఐపీఎస్ ఆఫీసర్ రాజీవ్ త్రివేది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పెషల్ పోలీస్ అసిస్టెంట్ (ఎస్‌పీఏ) ముసాయిదా నిర్ణయాలు ఇంకా అమలుకాలేదు. దీంతో పొట్టకూటి కోసం విధులు నిర్వర్తిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. చివరికి హోంగార్డు ఆవిర్భావ వేడుకలనూ జరుపుకోలేని దైన్య స్థితిలో ఉన్నామని, సర్కారు అధికారికంగా నిర్వహించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- హనుమకొండ టౌన్

5



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

ప్రజాపాలన అంటే అరెస్టులా?

- ప్రశ్నిస్తున్న శక్తులు, వ్యక్తుల గొంతు నొక్కుతున్న సర్కారు
- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన, ప్రజాస్వామ్యం అంటే అక్రమ అరెస్టులేనా అని శాసనమండలి సభ్యుడు (ఎమ్మెల్సీ) తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ప్రశ్నించారు. మహబూబాబాద్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడీలను బద్ధలు కొడుతానన్న సీఎం రేవంత్‌రెడ్డి తానే గడిని నిర్మించుకుని రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు.

ప్రశ్నించే శక్తు లు.. వ్యక్తుల గొంతులను నొక్కడంతో పాటు అక్రమకేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. సీఎం కుటుంబ సభ్యుల ఫార్మా కంపెనీల కోసం లగచర్లలో గిరిజనుల భూములను లాక్కొవాలని చూశారని, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పోరాటంతో వెనక్కితగ్గారని చెప్పారు.

ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు పోరాటం..

ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసేంతవరకు ప్రజల పక్షాన బీఆర్‌ఎస్ పోరాడుతుందని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణ కోసం పోరాడిన బీఆర్‌ఎస్ నాయకులకు కేసులు, నిర్బంధాలు కొత్తమి కాదని చెప్పారు. తెలంగాణలో ఏ ఒక్క పథకం కూడ సక్రమంగా అమలు కాలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేవలం 12 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని చెప్పారు. అరెస్టు చేసిన బీఆర్‌ఎస్ నేతలను భేషరుతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, కౌన్సిలర్ ఎడ్ల వేణు, నాయకులు బానోత్ రవికుమార్, మంగలంపల్లి కన్న, జెరిపోతుల వెంకన్న, తేళ్ల శ్రీను, పుచ్చకాయల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన

మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

గూడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌తోనే ప్రజలకు సుస్థిరమైన పాలన అందుతుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. గోవిందాపురం, గూడూరులలో అంగన్వాడీ పూర్వ ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించి చిన్నారులకు యూనిఫాం అందజేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతాశిశు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. అనంతరం గూడూరులోని జాతీయ రహదారిలో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించారు. తహసీల్దార్ శ్వేత, సీడీపీవో నిలోఫర్ అజ్మీ, ఎంపీవో సత్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా నాయకులు మాధవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, వాంకుడోతు కొమ్మాలు, మండల అధ్యక్షుడు చిట్టె వెంకటేశ్వర్లు, బోయినపల్లి సతీష్‌రావు, శ్రీపాల్‌రెడ్డి, చంటిస్వామి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

నెల్లికుదురు : పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. నెల్లికుదురు మండలకేంద్రంలోని రైతు వేదికలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతికి రైతు భరోసా అమలు చేసి, వారిని ఆదుకుంటామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. రబీలో ధాన్యానికి బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.రాజు, ఎంపీవో పద్మ, డీఈ చంద్రశేఖర్, ఏవో యాస్మిన్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మెడికోలకు భద్రతేదీ?

- భూపాలపల్లి మెడికల్ కళాశాల వద్ద ఆకతాయిల ఆగడాలు
- బుధవారం అర్ధరాత్రి హాస్టల్ ఎదుట వీరంగం
- మద్యం మత్తులో విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విద్యార్థినులు



రామప్ప కాలనీలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన హాస్టళ్లు

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థినులకు భద్రత కరువైందనడానికి భూపాలపల్లి మెడికల్ కళాశాల వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన సంఘటనే నిదర్శనంగా నిలుస్తోంది. ఈ మెడికల్ కాలేజీ విద్యార్థులకు ప్రభుత్వం రామప్ప క్వార్టర్స్‌లో తాత్కాలిక హాస్టల్‌ను ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. ఈ హాస్టల్ వద్ద బుధవారం అర్ధరాత్రి మద్యం తాగిన కొందరు ఆకతాయిలు తమ వికృతచేష్టలతో విద్యార్థినులను ఇబ్బంది పెట్టారు. దీంతో ఆ రాత్రంతా విద్యార్థినులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. గురువారం ఆ హాస్టల్ విద్యార్థినులు జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలివీ. మెడికల్ కళాశాల హాస్టల్‌లోని 51వ బ్లాక్‌కు ఎదురుగా ఉన్న రోడ్డుపై అర్ధరాత్రి సమయంలో కొందరు తాగుబోతులు వీరంగం సృష్టించారని, తమపైకి మద్యం బాటిళ్లు విసిరారని, అసభ్య పదజాలంతో దూషించారని రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో తాము పోలీసులకు సమాచారమిచ్చామని, అది తెలుసుకున్న ఆకతాయిలు అక్కడి నుంచి పరారయ్యారన్నారు. స్పందించిన కలెక్టర్ హాస్టల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారని, భద్రతలోపలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు సమాచారం.

ఎస్పీతో మాట్లాడి హాస్టల్ వద్ద భద్రత ఏర్పాట్లు చేస్తానని కలెక్టర్ విద్యార్థులకు భరోసా ఇచ్చినట్లు తెలిసింది. హాస్టళ్ల వద్ద భద్రత సిబ్బంది సంఖ్యను పెంచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించినట్లు సమాచారం. అయితే బుధవారం అర్ధరాత్రి ఆ హాస్టల్ వద్ద జరిగిన ఘటనకు ముందు బాయ్స్ హాస్టల్‌లో ఓ విద్యార్థి పుట్టిన రోజు పార్టీ జరిగిందని, ఆ పార్టీకి హాజరైన వారిలో కొందరు తప్పతాగి విద్యార్థినిల పట్ల అసభ్యంగా వేధించారని సమాచారం. ఇక ఈ హాస్టల్‌లో ఉన్న భద్రతా లోపాలు ఈఘటనలతో బహిర్గతమయ్యాయని, అర్ధరాత్రి సమయంలో బయటి నుంచి వ్యక్తులు హాస్టల్స్‌లోకి వస్తున్నా ఎవరు పట్టించుకోకపోవడమేంటన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధికారులు ఇప్పటికైనా స్పందించి హాస్టల్స్ వద్ద మెరుగైన భద్రతను కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈఘటన గురించి తెలుసుకున్న వారంతా మెడికల్ విద్యార్థినులకు భద్రత కరువైందన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

బైకులు, తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యం



దొంగల ముఠా అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

- కొన్నేళ్లుగా దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా
- ముగ్గురి అరెస్ట్
- 20.05లక్షల సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జల్సాలకు అలవాటు పడిన ముగ్గురు యువకులు.. చోరీలు చేస్తున్నారు. రాత్రి బయట ఉన్న బైక్‌లు.. తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌గా చేసుకొని కొన్నేళ్లుగా చేతివాటాన్ని ప్రదర్శిస్తున్న వారికి కాటారం పోలీసులు కళ్లెం వేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఎస్పీ కిరణ్‌ఖరే వివరాలను వెల్లడించారు. నవంబరు 27న కాటారం మండలంలోని శంకరంపల్లి గ్రామంలో చోరీ జరిగింది. తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడిన దుండగులు బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బాధితులు కాటారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తును ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఇన్నాళ్లు దొంగిలించిన సొత్తును విక్రయించేందుకు వెళ్తుండగా అప్పటికే సీసీ కెమెరాల ద్వారా నిందితులను పసిగట్టిన పోలీసులు కాటారం మండలం మద్దులపల్లి చెక్‌పోస్టు వద్ద అనుమానస్పదంగా ఉన్న ముగ్గురు నిందితులను పట్టుకున్నారు.

వీరిలో మంచిర్యాల జిల్లా గాంధీనగర్‌కు చెందిన తాకొండ స్వామి చరణ్ అలియాస్ మున్నా, అసిఫాబాద్ జిల్లా తిర్యానికి చెందిన కురాసేన ఈశ్వర్, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన పసేం రాజేష్‌లు ఉన్నారు. నిందితులు జల్సాల కోసం గతంలో మహారాష్ట్రలోని చంద్రాపూర్ దగ్గర రాజురా గ్రామం, ఘనపురం మండలంలో చెల్పూర్, కొయ్యూర్ గ్రామం, హనుమకొండ. సుబేదారి, మంథనిలోని గుంజపడుగు, పస్రా, కాటారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడి బంగారం, వెండి, ద్విచక్ర వాహనాలను దొంగిలించినట్లు అంగీకరించారు. దీంతో వారి వద్ద నుంచి 17.3 తులాల బంగారు ఆభరణాలు, 83 తులాల వెండి ఆభరణాలు, 6 బైక్‌లు, 1 ఎల్‌ఈడీ టీవీ, 1 సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకోగా.. వీటి విలువ మొత్తంగా రూ.20,05,800 ఉంటుందని ఎస్పీ వెల్లడించారు.

నేర చేదనలో సీసీ కెమెరాలు దోహదం చేస్తాయని, ప్రతీ ఒక్కరు ఇంటి పరిసరాల్లో, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు. కాగా, ఈ కేసు చేదనలో సమర్థవంతంగా పని చేసిన డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్సైలు అభినవ్, మహేందర్, రాజ్‌కుమార్‌తో పాటు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే, పలువురు సిబ్బందికి నగదు ప్రోత్సాహక బహుమతులను అందించారు.

లక్ష్మీ పంప్‌హౌస్ విద్యుత్ బిల్లు బకాయి రూ.546.01కోట్లు



లక్ష్మీ పంప్‌హౌస్

మహదేవపూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టులోని లక్ష్మీ పంప్‌హౌస్ విద్యుత్ బిల్లులు రూ. కోట్లలో పెండింగ్ ఉంటోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2019లో జూన్ 21 నుంచి లక్ష్మీ పంప్‌హౌస్‌లో మోటార్లు నడిపి ఎత్తిపోతలను ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు భారీగా కరెంట్ బిల్లులు ఉండిపోయాయి. కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి(లక్ష్మీ) పంప్‌హౌస్ కరెంటు బిల్లులు విద్యుత్ సంస్థకు భారీగా బకాయి పడింది. కాళేశ్వరం ప్రాజెక్టు 2019 జూన్ 21న ప్రారంభించగా ఇప్పటివరకు రూ.కోట్ల మేర బిల్లులు బకాయి పడ్డాయి. కన్నెపల్లి పంప్‌హౌస్ ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు సుమారుగా 163 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. దీంతో భారీగా కరెంటు బిల్లు వచ్చింది. ఇందులో రూ 319.91 కోట్ల మేర బిల్లు చెల్లింపు చేయగా.. మరో రూ.546.01 కోట్ల బిల్లులు విద్యుత్ సంస్థకు చెల్లించాల్సి ఉంది.

భూతల్లిని కాపాడుకోవడం అందరి బాధ్యత

మహబూబాబాద్ డీఏవో విజయనిర్మల



మహబూబాబాద్ రైతువేదికలో మాట్లాడుతున్న విజయనిర్మల

మహబూబాబాద్ అగ్రికల్చర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భూ తల్లిని కాపాడుకోవ డం ప్రతీ ఒక్కరి బాధ్యత అని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల అన్నారు. మహబూబాబాద్‌లోని రైతు వేదికలో గురువారం ప్రపంచ నేల దినోత్సవాన్ని వ్యవసాయాధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు సుస్థిరమైన, సారవంతమైన నేలను అందించడానికి తీసుకోవాల్సిన చర్యలు సహజ, సూక్ష్మజీవుల సంరక్షణ తీసుకోవాలని చెప్పారు. చౌడు నేలల పునరుద్ధరణకు పచ్చిరొట్ట, జీలుగ, జనుము, పిల్లిపెసరలాంటి పంటలను వాడుకోవాలనిసూచించారు. మహబూబాబాద్ డివిజన్ ఏడీఏ అజ్మీర శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి ఎస్.తిరుపతిరెడ్డి, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో..

మల్యాలలోని జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానంలో కూడా ప్రపంచ మృతిక దినోత్సవం జరిపారు. ఈ సందర్భంగా ఉద్యానపరిశోధన స్థానం అధిపతి నాగరాజు మాట్లాడుతూ నేలల్లో సారవంతాన్ని కాపాడుకోవాలని చెప్పారు. నేలను కాపాడుకుంటేనే భవిష్యత్‌లో ఆహారం అందించగలమని చెప్పారు. నేలను కాపాడుకోవడం అందరి బాధ్యత అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరిశోధన స్థానం ఉద్యోగులతో పాటు రైతులు పాల్గొన్నారు.

పట్టపగలే రెండు ఇళ్లలో చోరీ

- బంగారు, వెండి ఆభరణాలు, నగదు అపహరణ
- మానుకోట పట్టణంలో ఘటన



చోరీ జరిగిన చోట వేలిముద్రలు సేకరిస్తున్న క్లూజ్ టీం

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని బెస్తబజార్, మల్లం బజార్‌లో పట్టపగలే రెండు ఇండ్లల్లో చోరీ జరిగి రూ.12500 నగదు, ఆరు తులాలవెండి, 750 గ్రాముల బంగారు అభరణాలు అపహరించుకుపోయారు. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. బెస్తబజారుకు చెందిన జంగిలి హరీష్ అదే కాలనీలో ఉంటున్న అత్తగారింట్లో జరిగే తన కుమార్తె 21 రోజుల వేడుకలకు వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి, ఇంట్లోని బీరువాలోని ఆరుతులాల వెండి, 750 గ్రాముల బంగారు అభరణాలతో పాటు రూ.6,500 నగదును అపహరించుకుపోయారు. ఇదే కాలనీలోని దుగ్గి పుల్లమ్మ ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో చోరీకి యత్నించారు. మల్లంబజారుకు చెందిన మహేందర్-స్వాతి దంపతులు ఇంటికి తాళం వేసి పని నిమిత్తం బయటకు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండడంతో ఆందోళన చెందిన వారు ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో దాచిన రూ.6 వేల నగదు, ఒక్కొక్క గ్రాము విలువైన లక్ష్మీదేవి బంగారు బిల్లలు అపహరించుకుపోయినట్లు చెప్పారు. బాధితులు డయల్ 100కు కాల్ చేయడంతో బ్లూకోర్ట్స్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని చోరీలు జరిగిన రెండు చోట్ల క్లూజ్ బృందాలతో వేలిముద్రలు సేకరించారు. అనంతరం టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

రాత్రివేళల్లో కానరాని పెట్రోలింగ్

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గత ఆరు నెలలుగా ఎక్కడో ఓ చోట దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. కొత్త బజారులో ఇద్దరు బ్లూకోర్ట్స్ సిబ్బంది ఉన్నప్పటికి రాత్రి వేళల్లో ఎక్కడా వారి పర్యవేక్షణ లేదు. పాతబజారులో ఇద్దరు బ్లూకోర్ట్స్ సిబ్బంది ఉన్నప్పటికి తూతూ మంత్రంగా గస్తీ కాస్తూ తిరుగుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్ చేయడం లేదని పట్టణవాసులు వాపోతున్నారు. దీంతో ఆయా కాలనీల్లో దొంగల బీభత్సం ఎక్కువగా ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతి చెందిన లారీ డ్రైవర్ ఇర్ఫాన్

దంతాలపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం వరంగల్ జాతీయ రహదారిపై గల మండలంలోని బీరిశెట్టిగూడెం స్టేజీ వద్ద గురువారం ఆగి ఉన్న లారీని వెనక నుంచి వస్తున్న మరో లారీ అతివేగంగా ఢీకొనడంతో ఓ డ్రైవర్ మృతి చెందాడు. స్థానిక ఎస్సై రాజు కథనం ప్రకారం... హర్యానా నుంచి విజయవాడ వైపు వెళుతున్న బాస్మతి బియ్యం లోడు లారీ అతివేగంగా వచ్చి రోడ్డు దిగి ఆగి ఉన్న మరో లారీని ఢీకొనడంతో విజయవాడ వైపు వెళ్లుతున్న బాస్మతి బియ్యం లారీలో నిద్రిస్తున్న మరో డ్రైవర్ ఎస్‌కె ఇర్ఫాన్ (23) తీవ్ర గాయాలపాలై అంబులెన్స్‌లో ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడు ఇర్ఫాన్ హర్యానా రాష్ట్రంలోని సింగార గ్రామానికి చెందినవాడు. ఈ ఘటనలో రెండు లారీలు ధ్వంసమయ్యాయి. మృతుడి సోదరుడు ఎస్‌కే జఫ్రూ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.

గుండెపోటుతో శబరిమలైలో డోర్నకల్ వాసి మృతి




వీరన్న (ఫైల్)

డోర్నకల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పస్వామి దర్శనానికి కేరళ రాష్ట్రం శబరిమలై వెళ్లిన డోర్నకల్ మండలానికి చెందిన కుదుళ్ల వీరన్న (55) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షులు, తోటి అయ్యప్ప మాలధారులు తెలిపిన వివరాల ప్రకారం. వెన్నారం గ్రామానికి చెందిన వీరన్న అక్టోబరులో అయ్యప్పస్వామి మాలధరించాడు. ఈ నెల 2వ తేదీన వెన్నారంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన ఇరుముడి కార్యక్రమం అనంతరం తోటి మాలధారులతో కలిసి 3న ప్రత్యేక రైలులో ఖమ్మం నుంచి శబరిమలైకు తరలివెళ్లారు. గురువారం అక్కడ అయ్యప్ప దర్శనం కోసం వెళ్తుండగా గుండెపోటుకు గురైన వీరన్న కుప్పకూలిపోయాడు. వెంటనే తోటి స్వాములు అతడికి సీపీఆర్ చేసి ఎమర్జెన్సీ మెడికల్ బృందానికి సమాచారం అందించారు. వారు అక్కడికి వచ్చి ఆయన్ను పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించారు.

దాంతో అదే గ్రామానికి చెందిన తోటిస్వాములు వీరన్న కుటుంబసభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించారు. అయ్యప్ప దర్శనానికి శబరిమలై వెళ్లిన వీరన్న మృతి చెందడంతో వెన్నారంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వీరన్నకు తల్లి, భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరన్న మృతదేహాన్ని శబరిమలై నుంచి డోర్నకల్‌కు అంబులెన్స్ ద్వారా తీసుకొస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

గురుకులం మెస్ కాంట్రాక్టర్‌కు మెమో



ఇనుగుర్తి గురుకులంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ఇనుగుర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేం ద్రంలోని బాలికల గురుకులంలో గురువారం జోనల్ అధికారి స్వరూపారాణి, జిల్లా క్వాలిటీ చెక్ అధికారి శంకర్, మండల ప్రత్యేకాధికారి కృష్ణవేణి తనిఖీలు నిర్వహించారు. ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు పాటించని మెస్ కాంట్రాక్టరుకు మెమోను జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

మావోయిస్టు జైసింగ్ మృతదేహం అప్పగింత

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 1న మండలంలోని చల్పాక అడవుల్లో గ్రేహౌండ్స్ పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు నేలకొరిగారు. మృతిచెందిన మావోయిస్టుల మృతదేహాలను మండల కేంద్రంలోని సామాజిక వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించగా ఈ నెల 2న ఏడుగురి మృతదేహాలకు శవపరీక్షలు నిర్వహించారు. శవపరీక్షల అనంతరం మృతదేహాలను వారి బంధువులకు పోలీసులు అప్పగించారు. ఈనెల 4వతేదీ వరకు ఐదుగురి మృతదేహాలను పోలీసులు బంధువులకు అప్పగించి స్వస్థలాలకు తరలించారు. కాగా, మావోయిస్టు దళసభ్యుడు జైసింగ్ స్వగ్రామం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఇంద్రావతి సుదూర ప్రాంతం కావడంతో ఆయన బంధువులు ఆలస్యంగా ఏటూరునాగారానికి చేరుకున్నారు. జైసింగ్ తల్లిదండ్రులు కొట్టెం సమ్మి-లక్ష్మణ్‌లు గురువారం ఏటూరునాగారం చేరుకోగా వారికి మంగపేట ఎస్సై సూరి ఆధ్వర్యంలో జైసింగ్ మృతదేహాన్ని అప్పజెప్పి అంబులెన్స్ ద్వారా స్వగ్రామానికి తరలించారు.

నేడు మల్లయ్య మృతదేహం..

ఈనెల 1న మండలంలోని చల్పాక అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఏడుగురి మృతదేహాలకు ఈనెల 2న కేఎంసీ ఫోరెన్సిక్ వైద్య బృందం సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి మృతుల బంధువులకు అప్పగించనుండగా ఈనెల 4 వరకు ఐదు మృతదేహాలను వారి బంధువులకు పోలీసులు అందజేసి వారి స్వస్థలాలకు తరలించారు. కాగా, మావోయిస్టు దళసభ్యుడు జైసింగ్ మృతదేహాన్ని పోలీసులు గురువారం ఆయన బంధువులకు అప్పగించారు. ఏటూరునాగారం-మహదేవ్‌పూర్ డివిజనల్ కార్యదర్శి ఈగోలాపు మల్లయ్య అలియాస్ మధు భార్య మీనా పోలీసులు విషం ఇచ్చి బూటకపు ఎన్‌కౌంటర్‌కు పాల్పడి తన భర్తను చిత్రహింసలు పెట్టారని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ నెల 3న పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపి గురువారానికి వాయిదా వేసింది. గురువారం హైకోర్టులో పిటిషనర్ తరపు న్యాయవాది దశరథం వాదనలు వినిపించారు. బంధువులకు మృతదేహాన్ని చూపించకుండా పోలీసులు గోప్యత పాటించారని, మృతదేహంపై అనుమానాలు ఉన్నాయని, రీపోస్టుమార్టం నిర్వహించాలని వాదనలు కొనసాగాయి. ప్రభుత్వం తరఫున వాదనలు వినిపిస్తున్న న్యాయవాది(పీపీ) కేఎంసీ ఫోరెన్సిక్ వైద్య బృందం ఆధ్వర్యంలోనే శవపరీక్షలు నిర్వహించామని, మరలా శవపరీక్షలు నిర్వహించడం అవసరంలేదని, బంధువులకు కూడా శవపరీక్షల అనంతరం మృతదేహాలను చూపించే అవకాశం కల్పించినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. హైకోర్టు మరలా పోస్టుమార్టం నిర్వహించడం అవసరంలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది, ప్రభుత్వం తరఫున ఓ అధికారి సమక్షంలో బంధువులకు మృతదేహాన్ని పరిశీలించే అవకాశం కల్పించింది.

వీరి సమక్షంలో మృతదేహం పరిశీలన అనంతరం ప్రభుత్వం ఓ నివేదికను కోర్టుకు సమర్పించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈలోగా మృతదేహాన్ని దహన సంస్కారాల నిమిత్తం బంధువులు తీసుకువెళ్లవచ్చని హైకోర్టు స్పష్టం చేసింది. ఈమేరకు ఈగోలాపు మల్లయ్య అలియాస్ మధు భార్య కోర్టు తీర్పు అనంతరం ఏటూరునాగారంలోని సామాజిక వైద్యశాలకు చేరుకుంది. శుక్రవారం ఇరువర్గాల సమక్షంలో మృతదేహం పరిశీలన అనంతరం స్వగ్రామానికి తీసుకెళ్తామని భార్య మీనా స్పష్టం చేసింది.



జైసింగ్ మృతదేహం వద్ద అతడి బంధువు(మధ్యలో వ్యక్తి), మార్చురీ సిబ్బంది

'భద్రకాళి' గర్భంలో ఏముందో?

చారిత్రక చెరువు పూడికతీత వేళ ప్రజల్లో ఆసక్తికర చర్చ

- ప్రైవేటు కాంట్రాక్టర్‌కు పనుల అప్పగింత
- 900 ఏళ్ల నాటి సరస్సులో వారసత్వ సంపద దాగి ఉందనే భావన
- గుప్త నిధులు, విగ్రహాలు లభిస్తే పక్కదారి పట్టే అవకాశం
- చారిత్రక సంపదను కాపాడాలంటున్న ఓరుగల్లు వాసులు


పూడికతో కనిపిస్తున్న భద్రకాళి చెరువు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వందల ఏళ్ల చరిత్రకు చిరునామాగా ఓరుగల్లు నడిబొడ్డున ఉన్న భద్రకాళి చెరువు ఎన్నో చారిత్రక సంఘటనలకు సాక్ష్యం. తన గర్భంలో ఎన్నో రహస్యాలను అంతర్లీనంగా దాచుకున్న జలాశయం. ఒకప్పుడు 560 ఎకరాలు.. ఇప్పుడు 382 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువులో పేరుకుపోయిన మట్టిని వందల ఏళ్ల తరువాత వెలికితీసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సుందరీకరణ కోసం ఇప్పటికే నీటిని మొత్తం బయటకు పంపి.. చెరువును ఖాళీ చేసిన యంత్రాంగం.. పూడికతీత పనులను ఓ ప్రైవేటు కాంట్రాక్టర్‌కు అప్పగించింది. అయితే వందల ఏళ్ల చరిత్ర ఉన్న భద్రకాళి చెరువు పూడికతీతతో భూగర్భంలో దాగిఉన్న రహస్యాలు బయటకొచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. కాకతీయుల కాలంలో నిధిని దాచారని, అలాగే నవాబుల కాలం నాటి దాడుల సమయంలో విగ్రహాలను ఈ చెరువులో పడేశారనే చర్చ ప్రజల్లో ఉంది. వందల ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ చెరువులో ఏ మూలన ఏ రహస్యం దాగి ఉందో.. తవ్వకాల్లో ఏ చోట ఏ చరిత్ర బయటకు వస్తుందో.. అనేది ఆసక్తికరంగా మారింది.

ఈ నేపథ్యంలో క్షణక్షణం.. పోలీసుల రక్షణ.. సీసీ కెమెరాల నిఘా.. పురావస్తుశాఖ అధికారుల పర్యవేక్షణ ఎంతో అవసరమని, అధికారులు పూర్తి అప్రమత్తతతో ఉండాల్సిన అవసరం ఉందని, వారి పర్యవేక్షణలోనే పూడిక తీత పనులు జరగాలని ఓరుగల్లు వాసులు డిమాండ్ చేస్తున్నారు.

చెరువు అడుగున చరిత్ర?

భద్రకాళి చెరువు సుందరీకణలో భాగంగా చేపట్టిన పూడికతీత పనులపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది. వందల ఏళ్ల కిందట నిర్మించిన చెరువు కావటంతో ఎన్నో జ్ఞాపకాలకు, గుప్త నిధులకు, రహస్యాలు దాగిఉండి ఉంటాయన్న చర్చ జరుగుతోంది. కాకతీయుల కాలాన్నే పరిశీలిస్తే వరంగల్ కోటను జయించేందుకు అనేక దాడులు జరిగాయి. క్రీ.శ. 1303, క్రీ.శ 1310లో ఢిల్లీ సుల్తాన్ అల్లావుద్దీన్ ఖిల్జీ, మాలిక్ నేతృత్వంలో జరిగిన దాడులను ప్రతాపరుద్రుడు తిప్పి కొట్టారు. క్రీ.శ. 1321లో గియాజ్ ఉద్ దిన్ తుగ్లక్ ఉలుగ్ ఖాన్ నేతృత్వంలోని సైన్యం వరంగల్ కోటపై దాడికి దిగింది. ఇలా నాలుగైదు యుద్ధాలు, దాడులు వరంగల్‌పై జరిగాయి. ఒకప్పుడు భద్రకాళి చెరువు ప్రాంతం మొత్తంగా అడవిగా ఉండేదని, ఈ ప్రాంతంలో నీటి సౌలభ్యం ఉండటంతో ఇక్కడే ఎక్కువ మంది సేద తీరేవారని చెబుతుంటారు. దాడుల సమయంలో గానీ, ఇతర సందర్భంలో భారీగా నిధులను, యుద్ధ సామగ్రిని చెరువుల్లోనే దాచి పెట్టేవారు. భద్రకాళి ఆలయం ఉండటంతో పాటు ఇతర చిన్న చిన్న ఆలయాలు కూడా ఉండేవని, పరాయి దేశస్థుల దాడుల్లో ఆ ఆలయాలను ధ్వంసం చేసి విగ్రహాలు, ఇతర సామగ్రిని భద్రకాళి చెరువులో పడేసి ఉండొచ్చుననే అనుమానాలున్నాయి. వీటికి తోడు భద్రకాళి చెరువు పక్కనే ఉన్న సిద్దుల గుట్ట, భైరవ గుట్టల్లో ప్రాచీన కాలం నుంచి మహర్షులు, మునులు, సాధువులు, యోగులు దీక్షలు, పూజలు చేసుకునేవారని, గుట్టల కింది భాగంలో కూడా విగ్రహారాధన జరిగేదని చెబుతుంటారు. గుట్టల సమీపంలో ఎలాంటి ఆధారాలు పెద్దగా లేకపోవవటంతో అవి చెరువు గర్భంలో కలిసిపోయి ఉండాయని భావిస్తున్నారు. కాకతీయుల పాలన ముగిసిన తరువాత భద్రకాళి ఆలయం పూజలకు దూరమైందనే అభిప్రాయాలున్నాయి. ఈ క్రమంలో అనేక దాడులు, విధ్వంసాలకు భద్రకాళి చెరువు సాక్షిగా నిలిచిందని, అప్పుడు అడవి ప్రాంతంలో ఉండంటంతో ఎన్నో గుప్తనిధులు, విగ్రహాలు, యుద్ధ సామగ్రి, రాజులు ధరించిన వస్త్రాలు, కత్తులు ఇలా అనేకం చెరువు గర్భంలో కలిసిపోయి ఉంటాయనే చర్చ జరుగుతోంది.

భద్రకాళి చెరువులో పూడికతీతకు శ్రీకారం

వరంగల్ నగర నడిబొడ్డున ఉన్న భద్రకాళి చెరువుకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. కాకతీయుల కాలంలో క్రీ.శ 1,199-1,323 వరకు కాకతీయుల పాలన సాగింది. క్రీ.శ 1,199-1,262 మధ్యకాలంలో గణపతి దేవుడు వరంగల్ కేంద్రంగా కాకతీయ సామ్రాజ్యాన్ని విస్తరించారు. ఆ కాలంలోనే భద్రకాళి ఆలయానికి సమీపంలో ఈ సరస్సును నిర్మించినట్టుగా భావిస్తారు. 900ఏళ్ల కిందటే ఈ చెరువు నిర్మాణ జరగడంతో పాటు నగరవాసులకు తాగునీటిని అందించేవారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న భద్రకాళిచెరువులో భారీ మోతాదులో మట్టి పేరుకుపోయింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భద్రకాళి చెరువులో పూడిక తీసినట్టుగా అనవాళ్లు లేవని స్థానికులు పేర్కొంటున్నారు. భద్రకాళి బండ్‌ను ఇప్పటికే సుందరీకరణ చేయగా, చెరువులో పూడిక తీసి చెరువులో నీటి సామర్థ్యాన్ని పెంచాలని యంత్రాంగం ప్రణాళికను రూపొందించి అమలు చేస్తోంది. సుమారు 560 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు చుట్టూ భారీగా కబ్జాలకు గురైంది. దీంతో ప్రస్తుతం 382 ఎకరాల్లోనే భద్రకాళి చెరువు విస్తరించి ఉంది. 150 మిలియన్ క్యూబిక్ ఫీట్ల సామర్థ్యం ఉన్నా 132మిలియన్ క్యూబిక్ ఫీట్లకు నీరు చేరితే అలుగు పడుతుంది.

నవంబరు 8న చెరు వులో ఉన్న 130మిలియన్ క్యూబిక్ ఫీట్ల నీటిని బయటకు విడుదల చేసి చెరువును ఖాళీ చేశారు. పూడిక తీసే పనులను ప్రైవేట్ కాంట్రా క్టర్‌కు అప్పగించారు. పూడిక తీసి మరో 50మిలియన్ క్యూబిక్ ఫీట్ల నీటిని నిల్వ చేసేందుకు భద్రకాళి చెరువు సామర్థ్యాన్ని 200మిలియన్ క్యూబిక్ ఫీట్లకు పెంచాలని అధికారులు యోచిస్తున్నారు.

పర్యవేక్షణతోనే చరిత్రకు రక్షణ

ప్రభుత్వం భద్రకాళి చెరువును సుందరీకరించే పనులు చేప డుతోంది. ప్రస్తుతం చెరువులో ఉన్న 130మిలియన్ క్యూబిక్ అడుగుల నీటిని బయ టకు వదిలి ఖాళీ చేశారు. చెరువు విస్తరించి ఉన్న సుమారు 382 ఎకరాల్లో పూడికతీత పనులు చేపట్టనున్నారు. మట్టిని కూడా తరలిం చేందుకు నీటి పారుదల, రెవెన్యూ అధికారులు ప్రణాళిక రూపొందించారు. భద్రకాళి చెరు వులో పూడికతీతలో భాగంగా ఒక మీటర్ లోతు మట్టిని తీయ నున్నారు. ఒక మీటర్ మట్టి పూడిక తీసే సమయంలో చరిత్రాత్మక చెరువు కావటంతో ఏ మూల నుంచి ఏ రహస్యం బయటపడుతుందో.. ఏ ప్రాం తంలో.. ఏం చరిత్ర వెలుగులోకి వస్తుందోననే ఉత్కంఠ ప్రజల్లో కనిపిస్తోంది. రాత్రికి రాత్రి ఏదైనా విగ్రహమో.. చారిత్ర ఆనవాళ్లకు సంబంధించిన వస్తువో బయట పడి తే దాని భద్రతకు బాధ్యులు ఎవరనే చర్చ జరుగుతోంది. 2018 మే 4వ తేదీ న భద్రకాళి బండ్ సుందరీకరణ పనుల సందర్భంగా 1,300ఏళ్ల నాటి గణప తి పోలిన విగ్రహంతో పాటు శివలింగం, మరికొన్ని శిల్పాలు లభ్యమ య్యాయి. ఇవీ కాకతీయుల కాలం నాటికంటే పూర్వం విగ్రహాలుగా గుర్తిం చారు. అదే తరహాలో భద్రకాళి చెరువు మొత్తం పూడికతీస్తుం డటంతో చరిత్ర ఆనవాళ్ల బయట పడే అవకాశాలున్నాయనే చర్చ జరుగుతోంది. పూడిక తీత ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.

ఐఏఎస్ అధికారి నేతృత్వంలో పోలీసు అధికా రులు, పురావస్తుశాఖ అధికారులు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులతో కలిపి ఓ ప్రత్యేక పర్యవేక్షణ కమిటీని నియమించాలని ఓరుగల్లు వాసులు కోరుతున్నారు. 24 గంటలూ మట్టి తీసివేతపై నిఘా ఉంచాలని, అవసరమైతే ఉదయం 6 గం టల నుంచి సాయంత్రం 6గంటల వరకే పూడికతీత చేపట్టాలని కోరు తున్నారు. పూడికతీతలో ఏ రహస్యమో.. నిధి దొరుకుతుందా? లేదా అనేది పక్కన పెడితే.. ఎలాంటి అక్రమాలకు తావులేకుండా సుందరీకరణ పను లు పూర్తి చేసేందుకు కూడా ఈ కమిటీ ఉపయోగ పడుతుందని, ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

భద్రకాళి చెరువులో దీవి రహస్యమేంటో?

అద్భుత అందాలకు కేరాఫ్‌గా ఉన్న భద్రకాళి చెరువులోని ఓ ద్వీపంపై అందరి చూపు పడింది. చెరువు మధ్యలో సుమారు 2గుంటల విస్తీర్ణంలో ఈ ద్వీపం ఉంది. సహజ సిద్ధంగా ఏర్పడిన ద్వీపమా.. లేక పూర్వకాలంలో రాజులు లేదా ఇతరులెవ్వరైనా దీనిని నిర్మించారా? అనేది ఆసక్తికరంగా మారింది. పూర్వకాలంలో ఏదైనా గుప్తనిధులో.. లేక రాజకోట రహస్యం దాచి ఉంచినప్పుడు ఇలాంటి గుర్తులు ఏర్పాటు చేస్తారని చరిత్రకారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఓరుగల్లువాసులను మంత్రముగ్ధులను చేసే ఈ దీవి వెనుక ఉన్న రహస్యం ఏంటనే చర్చ జరుగుతోంది. ఇది సహజ సిద్ధంగా ఏర్పడిందే అయినా కొన్నేళ్ల తరువాత పూడికతీతకు ఏర్పాట్లు చేస్తుండటంతో ఈ దీవిపైనా ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది.

పొట్టకూటి కోసం వెట్టిచాకిరీ!

- సమస్యలతో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డులు
- ఆవిర్భావ వేడుకలూ నిర్వహించలేని దైన్యం
- నేడు హోంగార్డుల దినోత్సవం



హనుమకొండ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలను కాపాడటంతోపాటు నేరస్థులను పట్టుకునే విషయంలో పోలీసులకు దీటుగా విధులు నిర్వర్తించే హోంగార్డుల సంక్షేమాన్ని పాలకులు విస్మరిస్తున్నారు. ఉన్నతాధికారులు ఏ పనిని అప్పగించినా బాధ్యతతో నిర్వర్తించే హోంగార్డులను శాఖలోనే చిన్న చూపు చూస్తున్నారు. సమస్యలను పరిష్కరించాలని ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులతో పాటు పోలీసు ఉన్నతాధికారులను కలిసి విన్నవిస్తున్నప్పటికీ స్పందనలేదు. జీవితమంతా వెట్టిచాకిరీ చేయించుకుని చివరికి రిటైర్‌మెంట్ సమయంలోనూ బెనిఫిట్స్ ఇవ్వకుండా వివక్ష కనబరుస్తున్నారు. విధి నిర్వహణలో మరణిస్తే ఎలాంటి బెనిఫిట్స్ అందించకుండా, కారుణ్య నియామకాలను మధ్యలోనే ఆపి, సెలవులు ఇవ్వకుండా మానసిక వ్యధకు గురిచేస్తున్నారని హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 6వతేదీ శుక్రవారం 62వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వారి దీన పరిస్థితిపై కథనం.

అమలు కాని ముసాయిదా

బీఆర్ఎస్ హయాంలో హోంగార్డులకు రెండుసార్లు వేతనాలు పెంచి పీఆర్సీ ప్రకటించారు. నెలకు రూ.9000 ఉన్న వేతనాన్ని 12 000కు పెంచారు. ఆ తర్వాత 2018లో రూ.18000కు పెంచారు. అనంతరం యేటా రూ.వెయ్యి పెంచాని జీవో 14, 15 తీసుకొచ్చారు. 2021లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించినట్టుగా పీఆర్సీ అమలు చేసి చివరిగా నెల వేతనం రూ.27,640కు పెంచారు. యూనిఫామ్ అలవెన్స్‌తో పాటు 100రోజులకు డైట్‌చార్జీ చెల్లించాలని జీవోలో పొందుపరిచారు. మిగతా విషయాలైన రిటైర్‌మెంట్, డెత్ బెనిఫిట్స్, కారుణ్యనియామకాలు, సెలవుల అంశాల్లో ఇదే పద్ధతిలో న్యాయం చేయాలని హోంగార్డులు పోరాటాలు చేయగా, ఐపీఎస్ రాజీవ్ త్రివేది ఆధ్వర్యంలో స్పెషల్ పోలీస్ అసిస్టెంట్ (ఎస్‌పీఏ) అనే ఒక ముసాయిదా రూపకల్పన చేశారు. కానీ అది ఇప్పటికీ అమలు కాలేదు. అ ముసాయిదాను అమలు చేయాలని హోంగార్డులు కోరుతున్నారు. గతంలో ప్రతిపక్ష హో దాలో ఉన్న రేవంత్‌రెడ్డి హోంగార్డుల హక్కుల కోసం రోడ్డెక్కి పోరాటం చేశారని, ఇప్పుడు సీఎంగా హోంగార్డుల కష్టాలను గుర్తించి రావాల్సిన బెనిఫిట్స్ అందజేయాలని హోంగార్డులు వేడుకుంటున్నారు.

ఆవిర్భావ వేడుకలకు దూరం

హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గతంలో అట్టహాసంగా నిర్వహించేవారు. హోంగార్డులతో పరేడ్ నిర్వహించి, వారి కుటుంబసభ్యులను ఆహ్వానించి, విధి నిర్వహణలో ప్రతిభచూపిన సిబ్బందికి ప్రోత్సాహకాలు అందజేసి భోజనాలు ఏర్పాటు చేసి పెద్ద పండుగలా నిర్వహించేవారు. కరోనా తర్వాత నుంచి హోంగార్డు ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణ మరిచిపోయారు. ఉమ్మడి వరంగల్ జిల్లా సరిహద్దు జిల్లాల్లో ఇప్పటికే స్పోర్ట్స్ నిర్వహించి అట్టహాసంగా 62వ హోంగార్డు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో వేడుకలకు దూరంగా ఉండటంపై హోంగార్డులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఈ విషయంపై వరంగల్ పోలీసు కమిషనరేట్ హోంగార్డ్స్ ఆర్ఐ చంద్రశేఖర్‌ను సంప్రదించగా ఐదారేళ్లుగా వేడుకలు నిర్వహించడం లేదని చెప్పారు. వేడుకలు నిర్వహణపై ఎలాంటి సమాచారం లేదన్నారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి

ఉమ్మడి వరంల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 1300 మంది హోంగార్డులు విధులు నిర్వర్తిస్తున్నారు. పోలీసు రిక్రూట్‌మెంట్‌లో ఎక్స్ సర్వీస్‌మెన్‌కు కల్పిస్తున్న రిజర్వేషన్‌లు అమలు చేయాలని హోంగార్డులు అభ్యర్థిస్తున్నారు. ప్రతీ నోటిఫికే షన్‌లో హోంగార్డుల కోటాలోని పోస్టులు అలాగే మిగిలి పోతున్నాయని, ఎవరూ ఎంపిక కావడం లేదని, ఈ అంశాన్ని ప్రభుత్వం గుర్తించి ఎక్స్‌మెన్స్ సర్వీసుకు ఉన్న ప్రత్యేక సడలింపులను హోంగార్డులకు కల్పించాలంటున్నారు.

అలాగే జీవో 14, 15లో పొందుపరిచినట్లు యూనిఫామ్ అలవెన్స్, డైట్ చార్జీలు ఇవ్వకుండా ఐదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేసి, హోం గార్డుల కుటుంబాలు చిన్నాభిన్నం కాకుండా ఆదుకోవాలని కోరుతున్నారు.


బయ్యారం, గార్ల మండలాల పరిధిలో ఉన్న సత్యనారాయణపురం గ్రామం

ఔరా !

రోడ్లకు.. అటు.. ఇటు!

ఏ గ్రామమైనా ఒక మండల పరిధిలో ఉండటం సహజం. కానీ, అందుకు భిన్నంగా ఉంది మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని సత్యనారాయణపురం, బోడగుట్ట తండా, ఉప్పలపాడు గ్రామాల పరిస్థితి. మండలకేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉండే సత్యనారాయణపురం గ్రామంలో మొత్తం 70 కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామం మధ్య నుంచి ప్రధాన రహదారి వెళ్లగా ఒక వైపు బయ్యారం మండల పరిధిలో.. మరో వైపు గార్ల మండల పరిధిలో ఉంది.. బయ్యారం పరిధిలో 30 కుటుంబాలు, గార్ల పరిధిలో 40 కుటుంబాలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన పనుల విషయంలో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక ఇదే జిల్లాలోని మరో రెండు గ్రామాల ప్రజల పరిస్థితి మరీ విచిత్రంగా ఉంది. చూడటానికి ఒకే గ్రామంగా కనిపిస్తున్నా నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాలు వేరు. ఒక బజారు మహబూబాబాద్ నియోజకవర్గం మహబూబాబాద్ మండలం బోడగుట్ట తండా పంచాయతీ పరిధిలోది కాగా, మరో బజారు ఇల్లెందు నియోజకవర్గం బయ్యారం మండలం ఉప్పలపాడు పంచాయతీ పరిధికి చెందింది. ఇక్కడ సుమారు 500 ఇళ్లు ఉండగా, బోడగుట్ట తండా పరిధిలోకి 200 ఇళ్లు, ఉప్పలపాడు పంచాయతీ లక్ష్మీనరసింహాపురం పరిధిలో 300ఇళ్లున్నాయి. ఇక్కడ ఓ సిమెంటు రోడ్డు సరిహద్దుగా ఉంది. రెండు గ్రామాలను కలిసిన ఆ గ్రామంలో ఎమ్మెల్యేలు సహా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు వేరు కావడంతో ప్రజలు అవస్థలు పడుతున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యేలు, అధికారులు, ఇతరుల పర్యటనల సమయంలో అయోమయానికి గురవుతున్నట్లు చెబుతున్నారు.

- బయ్యారం (ఆంధ్రజ్యోతి)


సిమెంటు రోడ్డుకు అటు, ఇటు ఉన్న లక్ష్మీనరసింహాపురం, బోడగుట్ట తండా ఇళ్లు



కోడిగుడ్డు @ రూ.8

పెరిగిన ధర
ఒక్క ఎగ్ ట్రే రూ.200

చలి కారణంగా తగ్గిన ఉత్పత్తి

కేసముద్రం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పేద, మధ్య తరగతి వర్గాలకు అందుబాటులో ఉండే పౌష్టికాహారం గుడ్డు. చలికాలం కారణంగా ఆ గుడ్డు ధర రోజురోజుకు పెరుగు తోంది. గత నెలలో ఇదే రోజున 30 గుడ్ల ట్రే ధర ధర రూ.170 ఉండగా ఇప్పుడా ధర రూ.200కి పెరిగింది. నెల రోజుల నుంచి హోల్‌సేల్‌లో ట్రే ధర రూ.160 నుంచి ప్రతీరోజు రూ.1 నుంచి రూ. 2 వరకు పెరుగుతోంది. దీంతో 15 రోజుల క్రితం వరకు రిటైల్‌లో ఒక్కో గుడ్డును రూ.6 విక్రయించగా.. ప్రస్తుతం రూ.7 నుంచి రూ. 8కు అమ్ముతున్నారు. అధిక ధరతో మధ్యాహ్న భోజనం, ఇతర ప్రభుత్వ హాస్టళ్లలో గుడ్డు వడ్డించడం నిర్వాహకులకు భారంగా మారుతోంది.

ఈ నేపథ్యంలోనే గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని కొన్ని దుకాణాల వారు ఒక్కో గుడ్డును రూ.8 నుంచి రూ. 9కు కూడా అమ్ముతున్నారు. సాధారణంగా చలికాలంలో గుడ్లు 20 నుంచి 30 రోజుల వరకు ఎలాంటి ఫ్రీజర్లు అవసరం లేకుండా నిల్వ ఉంటాయి. ప్రస్తుత వాతావరణం కోడిగుడ్లను ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు అను వుగా ఉంటుంది. మరోవైపు కోళ్లఫాంలలో చలి పెరగడంతో గుడ్ల ఉత్పత్తి 60శాతానికి పడిపోయింది.

ఉదాహరణకు 10 వేల కోళ్లు ఉన్న ఫాంలో గత నెలలో నిత్యం 9 వేల గుడ్లు ఉత్పత్తి కాగా చలి పెరిగిన నాటి నుంచి 6వేల నుంచి 6,500 వరకే గుడ్ల ఉత్పత్తి వస్తోందని కేసముద్రంలో కోళ్ల ఫాం నిర్వాహకుడు బొబ్బాల యాకూబ్ రెడ్డి తెలిపారు. ఫలితంగా మొత్తం మూడోంతుల్లో ఒకవంతు ఉత్పత్తి పడిపోయింది.

ఈ కారణాలతో ఏటా చలికాలం గుడ్ల ధరలు స్వల్పంగా పెరగడం సహజం. మరోవైపు డిసెంబరులో క్రిస్మస్, కొత్త సంవత్సర వేడుకల్లో దేశ వ్యాప్తంగా లక్షల క్వింటాళ్ల కేకులను తయారు చేస్తారు. ఈ కేకుల తయారీ కోసం కోడిగుడ్లను అధికంగా వినియోగిస్తుంటారు. దీంతో డిసెంబరు నెలలో కోడిగుడ్ల వినియోగం అధికంగా ఉండటం, ఉత్పత్తి తక్కువగా ఉండడంతో ధరలు పెరుగుతుంటాయని హోల్‌సేల్ విక్రయదారులు తెలిపారు.

సామాన్యులు కొనే పరిస్థితి లేదు

బాణాల రమ, గృహిణి, కేసముద్రం స్టేషన్



సామాన్యులకు అందుబాటులో ఉండే కోడిగుడ్డు ధర కూడా ఇంతలా పెరుగుతుందని ఊహించలేదు. ఇప్పుడు గుడ్లను కూడా సామాన్యులు కొనే పరిస్థితి లేదు. కొద్దిరోజుల క్రితం రూ.6కు ఒకటి ఉండగా ఇప్పుడు రూ.8 నుంచి రూ.8.50పైసలకు అమ్ముతున్నారు. అన్ని నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినట్టే పేద, మధ్యతరగతి వర్గాలకు అవసరమయ్యే కోడిగుడ్డు రేటు పెరగడంతో కుటుంబాలపై మరింత భారం పడుతోంది.

క్యాన్సర్‌ను జయించి..

సామాజిక సేవలో ముందుండి

- సేవా గురువుగా గుర్తింపు తెచ్చుకున్న పింగిలి
- ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన పెంపునకూ కృషి

ఆదర్శం


'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతున్న పింగిలి శ్రీనివాస్

గూడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పిల్లల హృదయాంతరాల్లోకి వెళ్లగలిగే.. వారి ఆధ్యాత్మిక ప్రపంచాన్ని అర్థం చేసుకోలిగే.. కుటుంబాల స్థితిగతులను తెలుసుకుని ఆసరాగా నిలవగలిగే.. మనస్సున్న గురువులు కొందరే ఉంటారు. అలాంటి వారిలో పింగిలి శ్రీనివాస్ ఒకరు. విద్యార్థుల్లో భారతీయ విలువలను పెంపొందిస్తూ.. వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయడమే ధ్యేయంగా మార్చుకున్నారు గూడూరు మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్. ప్రమాదకరమైన క్యాన్సర్ మహమ్మారిని ఆత్మస్థైర్యంతో జయించి.. ముగ్గురు మిత్రులతో కలిసి మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ పాఠశాల నిర్వహిస్తున్న ఆయన వ్యాపార దృక్పథానికి దూరంగా, నైతిక విలువలకు దగ్గరగా ప్రయాణిస్తూ నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. గూడూరుకు చెందిన సరోజన-సత్తయ్య దంపతులకు జన్మించిన శ్రీనివాస్‌ది అతి సామాన్య కుటుంబం కావడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. భారతీయ విలువల రక్షణ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా 1990లో మానుకోటకు చెందిన అకారపు కె.కేశవరాజు గూడూరులో వివేకానంద పాఠశాలను ప్రారంభించగా.. ఆయన ఆశయాల పట్ల పింగిలి శ్రీనివాస్ ప్రభావితమయ్యారు. ఈ క్రమంలో కేశవ రాజు 1995లో ఆర్ఎస్ఎస్‌లో ఫుల్ టైమర్‌గా వెళ్లిపోయిన తర్వాత ఆ పాఠశాల బాధ్యతలను తీసుకున్న శ్రీనివాస్ 1997లో తన స్నేహితులు పింగిలి సంజీవరెడ్డి, కాల్సాని శ్రీనివాస్‌రెడ్డి, నలమాస వెంకన్నతో కలిసి అరవింద పాఠశాలగా మార్చారు. కానీ 2000 సంవత్సరంలో పింగిలి శ్రీనివాస్ సర్కోమా క్యాన్సర్ బారిన పడ్డారు. బతకడం కష్టమని వైద్యులు చెప్పినా ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా అనేక ప్రాంతాలు, ఆసుపత్రులకు వెళ్లి కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారంతో క్యాన్సర్‌ను జయించారు. అదే సమయంలో ప్రకృతితో కలిసి జీవించడం నేర్చుకున్న ఆయన తన చిన్నపాటి ఇంట్లో అనేక రకాల ఔషధ పండ్లు, కూరగాయల మొక్కలను పెంచారు. అంతేకాదు విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ 'సేవా గురు'గా పేరు తెచ్చుకున్నారు. ప్రతిభ ఉండి చదువుకోలేని స్థితిలో ఉన్న వారిని గుర్తించి చేరదీసి వారికి అండగా నిలిచి అనేక మంది జీవితాల్లో వెలుగులు నింపారు. ఆయన వద్ద చదువుకున్న అనేక మంది నేడు దేశవిదేశాల్లో ఉన్నత రంగాల్లో రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు పూర్వ విద్యార్థులు, స్థానికుల సహకారంతో అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు.

అలాగే ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడానికి కూడా కృషి చేస్తున్న ఆయన గూడూరు మండల కేంద్రంలో కాకతీయుల నాటి సనాతన శివాలయాన్ని శిథిలావస్థ నుంచి అద్భుతంగా మలిచారు. నేడు ఆ ఆలయం భక్తుల రాకపోకలు, నిత్య పూజలతో వర్ధిల్లుతోంది. అంతేకాకుండా బతుకమ్మ, దసరా వేడుకలు, తదితర పండుగల సందర్భాల్లో ప్రజలను శ్రీనివాస్ ముందుండి నడిపిస్తున్నారు. ఇక ఆయన సతీమణి స్వరూప కూడా ఆయన అడుగు జాడల్లోనే నడుస్తున్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో తనవంతు పాత్ర పోషిస్తున్నారు.

సామాజిక విలువలతో కూడిన విద్యనందించాలి
పింగిలి శ్రీనివాస్, గూడూరు

శ్రమకు విలువ కట్టకలిగే విద్యా విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలి. మార్కులతో కూడిన విద్యావిధానం కాకుండా విలువలతో కూడిన విద్యనందించాలి. ప్రాచీన వారసత్వ సంపదకు సంబంధించిన కథనాలు, జీవిత చరిత్రలు బోధించాలి. సామాజిక నైతిక సాంస్కృతిక విలువలను విద్యార్థులకు అందించాలి. ఆచరణాత్మకంగా అమలయ్యే విద్యా విధానం ద్వారా విద్యార్థుల భవిష్యత్ ఉంటుంది. విద్య నేర్పిస్తే కాదు.. చూపిస్తే వస్తుంది.. మార్కులు ప్రామాణికం కాదు.. వారికి ఆదర్శాలు నేర్పించాలి.

న్యూస్ బాక్స్

'ఆటో కార్మికులకు జీవన భృతి ఇవ్వాలి'

బయ్యారం, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు జీవనభృతి కల్పించాలని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్ల కంటి సూర్యం సీఐటీయూ మండల కన్వీనర్ వల్లాల వెంకన్న, ఏఐటీయూసీ మండల కన్వీనర్ సారిక శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 7న రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన ఆటోల బంద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ బయ్యారంలో గురువారం పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు, కార్మికులు బాబు సింగ్, యాకూబ్, వీరన్న, నాగేశ్వరరావు, శ్రీను, సాయి. సుబ్బు, నవీన్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి : ఏఈవో



చిల్కోడులోని వ్యవసాయ క్షేత్రంలో భూసార పరీక్ష చేస్తున్న అవినాష్

డోర్నకల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలలో పంటలు చేసే ముందు విధిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఈవో అవినాష్ అన్నారు. గురువారం చిల్కోడు రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వార సరైన పంటలు ఎంచుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకులు శుభ్రం

బయ్యారం, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని పలు పంచాయతీలో మిషన్ భగీరథ ఆధ్వర్యంలో ఓహెచ్ఆర్ఎస్ వాటర్ ట్యాంకులను శుభ్రం చేశారు. ట్యాంకుల్లో క్లోరినేషన్ చేశారు. గ్రామాల్లోని పైప్ లైన్ లీకేజీకి మరమతులు చేపట్టిన అధికారులు మిషన్ భగీరథ నీటి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. మిషన్ భగీరథ ఏఈఈ శ్రీజతో పాటు రాజ్ కుమార్, వెంటయ్య పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



రమేష్ అధ్యక్షుడు

గార్ల డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన మండల కమిటీని ఉద్యోగులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా బానోత్ రమేష్, గౌరవ అధ్యక్షుడిగా అజ్మీరా కిషన్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా వాంకుడోత్ అభిలాష్, కోశాధికారిగా అజ్మీరా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా కబ్బాకుల రామకృష్ణ, మీడియా విభాగం అధ్యక్షుడు భూక్యా వెంకటేష్‌తో పాటు మరో 13మందితో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

నాణ్యమైన భోజనం ఇవ్వాలి

గార్ల డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వడ్డన కార్మికులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఈవో మంకిడి వీరభద్రం అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో మధ్యాహ్నం భోజన ఏజెన్సీ కార్మికుల ప్రత్యేక సమావేశం జరిగింది.. టీటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మాలోత్ శివనాయక్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

'ప్రభుత్వం వాగ్దానాలను అమలు చేర్చాలి'

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి కంచవెంకన్న అన్నారు. సదరు డిమాండ్‌తో కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పోకు వినతిపత్రాన్ని అందించారు. నూకల ఉపేందర్, ఈసం రామయ్య, గుండాగాని సత్తయ్య, కటకం బుచ్చిరామయ్య, కరుణాకర్, ఈను, సత్యం పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డులకు వాకీటాకీల పంపిణీ

కేసముద్రం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో గురువారం సెక్యూరిటీగార్డులకు పది వాకీటాకీలను మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. మార్కెట్లో పనిచేస్తున్న 16 మంది సెక్యూరిటీ గార్డులు, 8 మంది అటెండర్, వాచ్‌మెన్‌లకు యూనిఫాంలను అందజేశారు. రూ.70వేలతో 10 వాకీటాకీలను కొనుగోలు చేసినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. జిల్లా మార్కెటింగ్ అధికారి వెంకటేశ్వర్లు, ప్రత్యేకహోదా కార్యదర్శి కోలా అమరలింగేశ్వర్‌రావు, కమిటీ సభ్యులు చిదిరాల వసంతరావు, అయూబ్ ఖాన్, చింతకుంట్ల యాదగిరి, కొట్టం రాము, గ్రేడ్-3 కార్యదర్శి రాజేంద్రప్రసాద్, రాజు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

గార్ల డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : శేరిపురానికి చెందిన దరావత్ ముత్తికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ద్వారా మంజూరైన రూ.45వేల చెక్కును సీపీఎం నాయకులు గురువారం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా హరినాయక్, సీపీఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి, సీఐటీయూ నాయకుడు కొండల్‌రావు పాల్గొన్నాడు.

సమావేశాలతోనే సరి

• సమస్యల పరిష్కారమేది? • నేడు తొర్రూరు మునిసిపల్ పాలకవర్గ సమావేశం • హాజరుకానున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



తొర్రూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పాలకవర్గ సభ్యులు సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నారే తప్ప.. సమస్యల పరిష్కారానికి చొరవచూపడం లేదని తొర్రూరు పట్టణ ప్రజలు వాపోతున్నారు. మునిసిపాలిటీకి గత ప్రభుత్వం నిధులు భారీగా కేటాయించినా అభివృద్ధి శూన్యం. వార్డుల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. శుక్రవారం నిర్వహించనున్న పాలకవర్గ సమావేశానికి పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో ప్రజలు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నారు.

తొర్రూరు పట్టణంలో ప్రధానంగా డంపింగ్ యార్డు, వివిధ వార్డుల్లో డ్రైనేజీల నిర్మాణం, సీసీ రోడ్లు, మునిసిపాలిటీలో సిబ్బంది కొరత, డివైడర్లపై ఉన్న కోనోకార్పస్ చెట్లను తొలగించాలని కోరుతున్నా పాలకవర్గం పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వం కుక్కలు, కోతుల బెడద నివారణకు రూ. 20 లక్షలతో నిర్మించిన ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ వృథాగా ఉంటుంది. వంద పడకల ఆస్పత్రి కాగితాలపైనే ఉంది. తొర్రూరు పట్టణంలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. డివైడర్లపై ఉన్న సెంట్రల్ లైటింగ్ పూర్తిస్థాయిలో వెలగకపోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు తీవ్రంగా జరుగుతున్నాయి. పట్టణ ప్రకృతి వనాలు మందుబాబులకు అడ్డాగా మారడంతో ఆహ్లాదం కోసం వెళ్తున్న వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పార్కు ఆవరణలో మునిసిపాలిటీ నుంచి నిధులు కేటాయించి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినా వృథాగా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాల క్రీడా ప్రాంగణ గేటుకు తాళం వేయడంతో నిరుపయోగంగా మారింది.

తొర్రూరులోని మునిసిపల్ కార్యాలయంలో పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్త తరలింపునకు డంపింగ్ యార్డు ఏర్పాటు చేసినా అది నిరుపయోగంగా మారింది. డంపింగ్ యార్డు పరిధిలో బయో మైనింగ్‌కు ప్రత్యేక నిధులు కేటాయించి పనులు ప్రారంభించినా మందకొండిగా కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు వినియోగంలోకి రాలేదు. ట్రాఫిక్ సిగ్నల్స్ కోసం మునిసిపాలిటీ నిధుల నుంచి రూ.15 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసినా అవి వృథాగా ఉంటున్నాయి. పట్టణంలోని ఖమ్మం, వరంగల్ జాతీయ రహదారి, ఎల్‌వైఆర్ రోడ్డు, అన్నారం రోడ్డులలో ట్రాఫిక్ తీవ్రంగా ఉంటుంది. పార్కింగ్ లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పాడుతున్నాయి.

సిబ్బంది ఇష్టారాజ్యం

మునిసిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, ఇతర మునిసిపాలిటీలో నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులు అందుబాటులో ఉండకపోవడం, విధులకు హాజరైన రోజు ప్రజలను లంచాల పేరుతో పట్టి పీడిస్తుండటంతో మునిసిపాలిటీకి రావాలంటేనే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారి ఇష్టానుసారంగా మామూళ్ల మత్తులో నిర్మాణాల కోసం పర్మిషన్లు ఇస్తున్నాడనే ఆరోపణలున్నాయి. అతనిపై చర్యలు తీసుకోవాలని పాలకవర్గం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

తొర్రూరు మునిసిపాలిటీలో సమస్యలు పేరుకుపోయినా పాలకవర్గ సభ్యులు, పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం సరికాదని, సంబంధిత ఉన్నతాధికారులు, మంత్రులు పట్టించుకుని సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరోగ్య తెలంగాణగా తీర్చిదిద్దడమే లక్ష్యం

● మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మానుకోట పట్టణంలో 5కె రన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య తెలంగాణగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. సీఎం కప్ క్రీడాపోటీలు, ప్రజా పాలన, ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మానుకోట పట్టణంలో గురువారం ఉదయం 5కెరన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ బండి సుధాకర్, కౌన్సిలర్లు పోతు రాజు రాజు, హరిసింగ్, బి.అజయ్‌సారథిరెడ్డి, నిమ్మల శ్రీను, ఖలీల్‌పాషా, సాయితేజ, వాకర్స్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో ప్రజాపాలన విజయోత్సవాలు..

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాలను నిర్వహించారు ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడారు. మహాలక్ష్మీపథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో జిల్లాలో 74 లక్షల మంది మహిళలు ప్రయాణించారని తద్వారా డిపోకు రూ.33 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులను సన్మానించారు. డీఎం శివప్రసాద్, సిబ్బంది శ్రీనివాస్, పాపిరెడ్డి, సత్యనారాయణ, వార్డు కౌన్సిలర్లు పోతు రాజు రాజు, దండెబోయిన బుజ్జి వెంకన్న, పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే..

జిల్లా కేంద్రంలోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్శిటీ (జేఎన్‌టీయూ) అనుబంధ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సర విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మరళీనాయక్ మాట్లాడుతూ.... ఇంజనీరింగ్ కళాశాలలో మౌళిక సదుపాయల కల్పనకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. జేఎన్‌టీయూ నోడల్ ఆఫీసర్, ప్రొఫెసర్ అరుణకుమారి, కళాశాల ప్రిన్సిపాల్ బలరాంనాయక్ పాల్గొన్నారు.

కుల, మతాలకతీతంగా పేదలకే ఇందిరమ్మ ఇళ్లు

కేసముద్రం (ఆంధ్రజ్యోతి) : క్రైస్తవులంతా కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు పలికారని, రాబోయే ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కుల, మత, పార్టీలకతీతంగా నిరుపేదకే ఇందిరమ్మ ఇళ్లలో తొలిప్రాధాన్యతనిస్తామని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. కేసముద్రం విలేజి సిలోయము ప్రార్థన మందిరంలో గురువారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ప్రీ ఐక్య క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే హాజరై కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోకవర్గానికి 3500 ఇళ్లు మంజూరయ్యాయని, గూడూరు ఏజెన్సీలో అదనంగా మరో 500 నుంచి వెయ్యి ఇళ్లు మంజూరవుతాయని తెలిపారు. వరంగల్‌కు చెందిన ప్రీతా జడ్సస్ వాక్యోపదేశం చేయగా కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐ మురళీధర్‌రాజ్, సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, అయూబ్ ఖాన్, పోలెపల్లి వెంకటరెడ్డి, ఫెలోషిప్ రాష్ట్ర బాధ్యుడు పిల్లి కుమారస్వామి, మండల అధ్యక్షుడు అప్పాల పేతురు, ఎలుక ప్రభుజీవన్, పృథ్వీరాజ్, ఇశ్రాయేల్, జోసెఫ్ సురేష్, విక్టర్‌పాల్, కాలెపాక మహేందర్ పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు సాయం చేయడంలోనే సంతృప్తి

• గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకుడు కిషన్‌నాయక్



బాలసదన్‌లో పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కిషన్‌నాయక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అనాథ పిల్లలకు సహాయం చేయడం సంతృప్తిగా ఉందని గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకుడు గుగులోతు కిషన్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలసదన్‌లో ఉంటున్న అనాథ, బాలకార్మికులు, నిరాదారణకు గురైన 19 మంది పిల్లలకు గురువారంకిషన్‌నాయక్ తండ్రి విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గుగులోతు హతిరాంనాయక్ జ్ఞాపకార్థం దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలంలో పిల్లలు చలి బారి నుంచి రక్షించుకునేందుకు దుప్పట్లు అందించినట్లు తెలిపారు. బాలసదన్ సూపరింటెండ్ డి.కృష్ణవేణి, జానావత్ మోహన్, డిప్యూటీ సూపరింటెండెంట్‌సునిల్‌బాబు, ఉపాధ్యాయినీ ప్రియాంక, సూపర్‌వైజర్లు రాజ్‌కుమార్, గుమ్‌లాల్, శ్రీకాంత్, దిలీప్, ప్రదీప్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో చూపాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి

కురవి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరమైనా మాటలకే పరిమితమైందని.. ప్రజా పాలన ఆచారణలో చూపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. కురవిలో గురువారం జరిగిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంబరాలకే పరిమితం కాకుండ నిజాయితీగా సమీక్ష చేసుకుని నిరుపేదలకు ఉపయోగపడే పనులు చేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ముఖ్యంగా పెంచుతామన్న పింఛన్‌లను తక్షణమే అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, మండల కార్యదర్శి కర్నం రాజన్న, బుర్ర సమ్మయ్య, తురక రమేష్, బుడమ వెంకన్న, కన్నె వెంకన్న, దూదికట్ల సారయ్య పాల్గొన్నారు.

శ్రీరామచంద్రస్వామి వార్షికోత్సవాలు షురూ



శ్రీరామచంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రెడ్యాలలో శ్రీసీతా లక్షణ సమేత శ్రీరామచంద్ర స్వామి దేవాలయంలో గురువారం చతుర్ధ వార్షికోత్సవ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 8 వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. తొలిరోజు గురువారం సాయంత్రం 6గంటల నుంచి సామూహిక శ్రీవిష్ణుసహస్ర నామ స్తోత్ర పారాయణము, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనము, రక్షబంధనం, మృత్యుంగ్రహణ, అంకురారోపణ, తీర్థప్రసాదగోష్టి నిర్వహించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, బిందురెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు హాజరై స్వామివారికి పూజలు చేసి ఆశీస్సులు పొందారు.

వరంగల్ అర్బన్ కో-ఆపరేటీవ్ బ్యాంక్ శాఖ ప్రారంభం



మానుకోటలో వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ శాఖను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని నర్సంపేట బైపాస్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ నూతన శాఖను గురువారం స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మాట్లాడారు. బ్యాకింగ్ రంగంలో వరంగల్ కోఆపరేటివ్ బ్యాంక్ అగ్రగామిగా నిలుస్తోందని చెప్పారు. 1994లో ఆవిర్భవించిన ఈ బ్యాంక్ ఇప్పటి వరకు రూ.400 కోట్ల టర్నోవర్‌ను పూర్తి చేసుకుందని, త్వరలోనే జనగామ, వడ్డెపల్లిలో నూతన శాఖలు ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపుడి నవీన్‌రావు, డీసీవో వెంకటేశ్వర్లు, బ్యాంకు డైరెక్టర్లు తోట సంపత్, ముందడ వేణుగోపాల్, పాపిరెడ్డి, కూరపాటి చంద్రమౌళి, మందా స్వప్నశ్రీనివాస్, హరినాథ్, బ్యాంక్ సీఈవో సత్యనారాయణరావు, సీపీఎం మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య, స్థానిక నేతలు బానోత్ రవి కుమార్, ఖలీల్‌పాషా, ఎడ్ల వేణుమాధవ్, పోతు రాజు రాజు, బండారు వెంకన్న పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్రం అభివృద్ధి : బీజేపీ



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాప సీతయ్య

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, యాత్ర ప్రముఖ్ యాప సీతయ్య అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చి, ఏడాది కావొస్తున్నప్పటికి ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడమే కాక 66 మోసాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.150 కోట్లు దండుకునేందుకు యత్నిస్తుందన్నారు. కాంగ్రెస్ గడీల పాలనను ప్రజలు తిప్పికొట్టాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, దార ఇందుభారతి, మారగాని రాజుగౌడ్, మల్లం యశ్వంత్, సురేందర్, పొదిళ్ల నర్సింహారెడ్డి, భావన్‌ప్రసాద్, మల్లేష్‌యాదవ్, పల్లె సందీప్, రేష్మా, శ్రీనునాయక్, బాలునాయక్, వెన్నమల్ల సందీప్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై దాడులను అరికట్టాలి

పెద్దవంగర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సామాన్యులను గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులపై సమాజంలో జరుగుతున్న దాడులను అరికట్టాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సోమారపు ఐలయ్య తెలిపారు. గురువారం మండలంలోని చిట్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆ సంఘం మండల అధ్యక్షుడు చిక్కాల సతీష్ యాదవ్ అధ్యక్షతన భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాకయ్య, యుగేందర్, నరేష్, మల్లేశం, కోటేశ్వర్‌రావు, హరిసింగ్, విజయలలిత, రమేష్, ప్రభాకర్, రాజేందర్, విద్యాసాగర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడల నిర్వహణపై సమీక్ష సమావేశం

చిన్నగూడూరు, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో రామారావు అధ్యక్షతన గ్రామ, మండలస్థాయి సీఎంకప్ నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎం కప్ 2024 మార్గదర్శకాల ప్రకారం గ్రామస్థాయిలో ఈనెల 7, 8 తేదీలలో, మండల స్థాయిలో 10, 11, 12 తేదీల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సీఎం కప్ ఆన్‌లైన్ లింక్‌ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు. తహసీల్దార్ మహబూబ్ అలీ, ఎస్సై ఝాన్సీ, ఎంఈవో రవి కుమార్, ఆర్‌ఐ వెంకన్న, పీఈటీ నాగేష్ పాల్గొన్నారు.

ప్రపంచ నేల దినోత్సవం

బయ్యారం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మృత్తిక (నేల) దినోత్సవంలో భాగంగా గురువారం బయ్యారంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నేల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో భూమి, ఆరోగ్యం, మట్టిలో సూక్ష్మజీవుల ప్రాముఖ్యత, సేంద్రియ ఎరువుల వినియోగం, పచ్చిరొట్ట ప్రాముఖ్యత తదితర అంశాల ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రచనతో పాటు రైతులు హరినాథ్ బాబు, సత్యనారాయణ, నిర్మలారెడ్డి, వెంకటనారాయణ, కళింగ రెడ్డి, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

తొర్రూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని డిప్యూటీ పారా మెడికల్ అధికారి వనాకర్‌రెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని తొర్రూరు, నెల్లికుదురు, దంతాలపల్లి మండలాల్లో సిబ్బంది నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈనెల 15 వరకు డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో సిబ్బంది సర్వే నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తిస్తారని ప్రజలు సహకరించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

బస్సుల సంఖ్యను పెంచాలి

తొర్రూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణానికి అనుమతి ఇచ్చినా, కొన్నిబస్సులను రద్దుచేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రద్దీ ఉన్న ప్రాంతాల్లో సర్వీసులు పెంచాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. గురువారం బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించి ఆయన మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గం నుంచి ప్రతీరోజు హైదరాబాద్, వరంగల్, ఖమ్మం తదితర ప్రాంతాలకు వేలాదిగా తరలివెళ్తారని, అధికారులు ఆ రూట్‌లలో బస్సులు రద్దుచేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బస్సులు తెప్పించి ఆయ రూట్‌లలో నడిపించాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈనెల 9న బస్‌భవన్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. నాయకులు వీరన్న, వెంకటేశ్వర్లు, యాకయ్య, నవీన్, మురళి, మల్లేశం, రవీందర్ తదితరులు ఉన్నారు.

'నేల స్వభావాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులదే'

పెద్దవంగర, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : నేల స్వభావాన్ని కాపాడుకోవాల్సి బాధ్యత రైతులదేనని మండల వ్యవసాయాధికారి గుగులోతు స్వామినాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా మానవళి మృత్తికలకు సంబంధం, జీవన ఎరువుల యొక్క ప్రాముఖ్యతలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రసాయానిక ఎరువుల వాడకాన్ని తగ్గిం సేంద్రియ ఎరువుల వినియోగించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో 22 రకాల నేలలు ఉన్నాయని పేర్కొన్నారు. మననేలల్లో సేంద్రియ కర్బనం తక్కువగా ఉంటుందని దాని కోసం పచ్చిరొట్టే ఎరువులు వాడాలన్నారు. ఈకార్యక్రమంలో ఏఈవోలు యశస్విని, రాజు, విశ్వశాంతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేయాలి : సీపీఎం

డోర్నకల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ నియోజకవర్గానికి ముంజూరైన ఇంటిగ్రేటెడ్ పాఠశాలను డోర్నకల్ మండలంలోనే ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొమ్మన అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమ్మపాలెం, వెన్నారం, కన్నెగుండ్ల రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములు ఉన్నాయని, వాటిలో పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలను వేరే ప్రాంతానికి తరలిస్తే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ఉప్పనపల్లి శ్రీనివాస్, దాసరి మల్లేశం, పట్టణ కార్యదర్శి ఎండి.నవాబ్, జేవీఆర్, పుల్లారావు పాల్గొన్నారు.

● డోర్నకల్ మండలంలోనే ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేయాలని డోర్నకల్ మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక గాంధీ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పుల్లారావు, శేఖర్, నరేష్, సాయికుమార్, భాస్కర్, రవీందర్, ఉపేందర్ పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పర్చాలి

● బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్

తొర్రూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుపర్చాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్ అన్నారు. గురువారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని చార్జిషీటు విడుదల చేసి ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అసెంబ్లీలో మాట్లాడిన ప్రతి అంశం వ్యక్తిగత లాభాపేక్ష తప్ప అభివృద్ధి, నిబద్ధత శూన్యం అన్నారు. నియోజకవర్గంలో సమస్యలు పేరుకుపోయాయని వెంటనే పరిష్కరించాలన్నారు. నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ సెంటర్, జీపీలకు రూ.25లక్షల నిధులు, కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్క్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. దయాకర్‌రావు నియంతృత్వ పాలనపై విసుగు చెందిన పాలకుర్తి ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం కల్పిస్తే ఏడాదిలోనే ప్రజల విశ్వాసం కోల్పోయారని వారి నమ్మకాన్ని వమ్ము చేయడం దురదృష్టకరం అన్నారు. వెంటనే ఇచ్చిన హామీలను అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లె కుమార్, రాంబాబు, రాజేష్, యాకయ్య, శేఖర్, నవీన్, యాకన్న, చలపతి రాజు, సంతోష్, శివ తదితరులు ఉన్నారు.



కాంగ్రెస్ హామీల చార్జ్‌షీట్ విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

సారవంతమైన నేలను అందించాలి

కేసముద్రం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భావితరాలకు సారవంతమైన నేలను అందించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మండల వ్యవసాయాధికారి బి.వెంకన్న కోరారు. కేసముద్రం రైతువేదికలో గురువారం ప్రపంచ మృతిక (నేల) దినోత్సవం సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రసాయనిక ఎరువులుకాకుండా సేంద్రీయ ఎరువులు ఉపయోగిస్తే నేల కాలుష్యాన్ని నివారించవచ్చని సూచించారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గించి భూమిలో కరిగిపోయే వస్తువులను ఉపయోగించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

భూమిని సర్వే చేయాలి

నెల్లికుదురు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నైనాల గ్రామంలో ఇండ్ల స్థలాల కోసం ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమిని సర్వే చేయాలని సీపీఎం మండల నాయకుడు బానాల యాకయ్య తెలిపారు. అక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని గురువారం గ్రామస్థులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 1998లోసర్వేనెంబర్ 610, 611లో 3ఎకరాల భూమిని ఇండ్ల స్థలాలకోసం కొనుగోలు చేసిందని ఆ భూమిలో 35 గుంటలు ఆక్రమణకు గురైందని సర్వేచేసి స్వాధీనం చేసుకొని ఇండ్లులేని నిరుపేదలకు పంపిణీ చేసి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెరమాండ్ల బాబు గౌడ్, తోటనర్సయ్య, వెంకన్న, రామరాజు సమ్మయ్య, పెరమాండ్ల పుల్లయ్య, వెంకన్న, తోట శ్రీను, దండెంపెల్లి కొమురయ్య, చెడుపాక వెంకన్న పాల్గొన్నారు.

'నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా కురిసిన అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతాంగాన్ని ఆదుకోవాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) రాష్ట్ర సహాయ కార్యదర్శి చిన్నచంద్రన్న డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అనేక మండలాల్లో కురిసిన అకాల వర్షంతో రైతాంగాన్ని అపార నష్టం వాటిల్లిందని చెప్పారు. ఈ సమావేశంలో పైండ్ల యాకయ్య, పాపారావు, రాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.